క్లుప్తంగా

విద్యార్థినికి అభినందన



పూజితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

హిరమండలం: ఇష్టపడి చదివితే మంచి ఫలితాలతోపాటు ఉన్నతి శిఖరాలను అధిరోహించవచ్చునని పాతపట్నం మండల కేంద్రానికి చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు పారశెల్లి రామరాజు అన్నారు. హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో (582) మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన టంకాల షర్మిలా పూజితను హెచ్‌ఎం టి.కేశవరావు ఆధ్వర్యంలో గురువారం అభినందించారు. నగదు బహుమతి, పురస్కారం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ సి.హెచ్.కల్యాణి, వైస్ చైర్మన్ జి.అప్పయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ శోభారాణి

నరసన్నపేట: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గల నరసన్నపేట, పోలాకి మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలని, కేంద్రాల చుట్టూ పరిశుభ్రత పాటించాలని పీఓ శోభారాణి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు పని చేయాలని, సమయపాలన విధిగా పాటించాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో అందరూ పాల్గొనాలన్నారు. బాల్య వివాహాలు అరికట్టాలని, కిశోర బాలికలకు తగిన సూచనలు ఇస్తుండాలన్నారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, అప్రమత్తంగా లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యకర్తలతో యోగాసనాలు వేయించారు. సూపర్‌వైజర్ రామణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను పనిలో పెడితే చర్యలు



స్వీట్ షాపులో తనిఖీలు చేస్తున్న లేబర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

పాతపట్నం: చిన్నారులను దుకాణాల్లో పనిలో చేర్పించకూడదని, చిన్న పిల్లలతో పని చేయించకూడదని హిరమండలం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు అన్నారు. పాతపట్నంలో ప్రధాన రహదారిపై ఉన్న పలు దుకాణాలు, స్వీట్స్, దుస్తుల షాపులను గురువారం తనిఖీ చేశారు. 14 ఏళ్ల వయస్సు లోపల పిల్లలు ఇంటి పనులు, దుకాణాల్లో పనిచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్ వైజర్ వైకుంఠరావు, సోషల్ వర్కర్ జనార్దనరావు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం !



కూలిన మట్టి గోడ

బూర్జ: మండలంలోని తోటవాడలో జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ తాగు నీటి కుళాయిల కోసం గురువారం జేసీబీతో రోడ్డుకు ఇరువైపులా గోతులు తవ్వారు. పైల సింహాచలం పూరింటి వద్దకు తవ్వుతుండగా మట్టిగోడ కూలింది. మధ్యాహ్న సమయం కావడంతో ఇంటిలో కుటుంబ సభ్యులు ముగ్గురు నిద్రిస్తున్నారు. గోడ కూలిన శబ్దం రావడంతో భయంతో బయటకు వచ్చారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఇంటి గోడ నిర్మించాలని ఆ కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ప్రధాని సభను విజయవంతం చేయాలి

పొందూరు: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న విశాఖపట్నంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా పాల్గొంటున్న ప్రధాని నరేంద్ర మోదీ సభను విజయవంతం చేయాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్ అన్నారు. పొందూరు ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ప్రధాని సభపై నాయకులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా యువత ఈ సభలో పాల్గొనేలా చూడాలన్నారు. ప్రపంచం దృష్టంతా విశాఖ యోగాంధ్ర సభపై ఉందన్నారు. ప్రత్యేక పరిశీలకులు, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, మార్కపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, మండలాధికారులు పాల్గొన్నారు.

నకిలీలతో జాగ్రత్త



సారవకోటలో వరి విత్తనాలు చల్లుతున్న రైతు

- ఆరంభమైన ఖరీఫ్ సీజన్
- ముమ్మరంగా వ్యవసాయ పనులు
- విత్తనాలు, ఎరువులు కొనుగోలుకు ఇదే అదును
- గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాల నుంచే కొనుగోలు చేయాలి

సారవకోట: ఖరీఫ్ సీజన్ వచ్చేసింది. రుతు పవనాలు ప్రవేశించి వర్షాలు కురుస్తుండటంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. దుక్కులు, గట్లు వేయడం, గట్లుపై గడ్డి మందు చల్లడం తదితర పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం నరసన్నపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో విత్తనాలు నేరుగా చల్లుకుని వ్యవసాయం చేయడం గత కొన్నేళ్లుగా అలవాటు చేసుకున్నారు. 5 నుంచి 10 శాతం మాత్రమే నాట్లు వేసే పద్ధతిని ఇంకా కొన్ని ప్రాంతాల్లో కొనసాగిస్తున్నారు. నేరుగా విత్తనాలు చల్లకుని వరి సాగు చేసే విధానం అధికంకావడంతో నకిలీ విత్తనాలపై దృష్టి సారించాలని వ్యవసాయశాఖ సిబ్బంది రైతులను సూచిస్తున్నారు.

డీలర్ల వద్దే కొనుగోలు చేయాలి..

పలు కంపెనీల ఆకర్షనీయమైన ప్రకటనలు చూసి మోసపోయి వారి ఉత్పత్తులను కొనవద్దని అధికారుల చెబుతున్నారు. గుర్తింపు పొందిన కంపెనీల నుంచి కొనాలని హెచ్చరిస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు ఏ రకం విత్తనాలు కావాలో ఆ రకం విత్తనాల కోసం నమోదు చేసుకుంటే ఆ రకం విత్తనాలు వచ్చేవి. ప్రస్తుతం ఆ రకమైన విధానం ఈ కూటమి ప్రభుత్వం కన్పించే దాఖలాలు లేవు. నరసన్నపేట నియోకవర్గంలోని నాలుగు మండలాల్లో ఈ ఏడాది 30,140 హెక్టార్లలో వరి సాగు చేసేందుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు.

జాగ్రత్తలు ఇవే..

వ్యవసాయ శాఖ నుంచి లైసెన్స్ పొందిన అధీకృత డీలర్ నుంచే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలి. బిల్లుపై విక్రయదారుని పేరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అమ్మకం పన్ను నంబర్, రైతు, గ్రామం, విక్రయదారుని సంతకం, తేదీ, నికర ధర, కంపెనీ పేరు ఉన్నాయో, లేదో చూసుకోవాలి. లూజుగా ఉన్నా, సంచులు చిరిగి పోయిన ఉన్నా, సీల్ తీసిన డబ్బాల నుంచి విత్తనాలు కొనుగోలు చేయవద్దు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో ప్యాకెట్‌కు సీల్ ఉందా, లేదో పరిశీలించి సీల్ ఉంటేనే కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసే సమయంలో ఇచ్చిన బిల్లు పంట పండే వరకు భద్రపరుచుకోవాలి. మొలకెత్తే దశ పూత దశ, పంట దశలలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయ శాఖాధికారులను సంప్రదించాలి. ఎరువులు అయితే మిషన్ కుట్టుతో ఉన్న సంచుల్లో మాత్రమే కొనుగోలు చేయాలి. చేతికట్టుతో ఉన్న సంచులను కొనుగోలు చేయవద్దు. పోషక వివరాలు, ఉత్పత్తిదారు సంస్థ పేరు, ఉత్పత్తిదారు పేరు ఉంటేనే కొనుగోలు చేయాలి. ఎరువుల సంచుల్లో కొనుగోలు చేసిన ఎరువుతో పాటు అన్య పదార్థాలు ఉంటే వ్యవసాయ శాఖాధికారులకు ఫిర్యాదు చేయాలి.

నరసన్నపేట నియోజకవర్గంలో	వరి సాగు విస్తీర్ణం(హెక్టార్లలో) వివరాలు..					
	మండలం	నరసన్నపేట	పోలాకి	జలుమూరు	సారవకోట	మొత్తం
	విస్తీర్ణం	7496	7852	8568	6524	30,140


బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి



రైతులు విత్తనాలు, ఎరువులు అధీకృత డీలర్ల నుంచి కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన వాటికి తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలి. అందులో పొందుపర్చాల్సిన వివరాలు పూర్తిస్థాయిలో నమోదు చేశారా, లేదా అని సరి చూసుకోవాలి. ఏదైనా తేడా వస్తే వ్యవసాయశాఖాధికారుల దృష్టికి తీసుకురావాలి.

– కె.సి.హెచ్.వెంకటరావు, ఏఓ, సారవకోట

దాతల సాయంతో మందిరం నిర్మాణం



గుండిచా మందిరం

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో భక్తుల నుంచి పూజలు అందుకుంటున్న జగన్నాథస్వామికి దాతల సహాయంతో గుండిచా మందిరం నిర్మించినట్లు ఉప సర్పంచ్ ఆశోక్ పాణిగ్రహి గురువారం తెలిపారు. రథ యాత్ర సందర్భంగా జగన్నాథ స్వామివారు ప్రధాన ఆలయం నుంచి గుండిచా మందిరానికి తరలివెళ్తారన్నారు. పది రోజులపాటు గుండిచా మందిరంలో దశ అవతారాల్లో దర్శనమిచ్చి పూజలు అందుకుంటారన్నారు. గ్రామంలో ఉన్న గుండిచా మందిరం శిథిలం కావటంతో ఐదేళ్లుగా ప్రధాన ఆలయంలోనే జగన్నాథ స్వామి దశ అవతారాల్లో దర్శనం ఇచ్చేవారన్నారు. దీనిపై స్పందించిన స్థానికులు దాతల సహాయంతో గుండిచా మందిరాన్ని నిర్మించారన్నారు. ఈ ఏడాది జూలై 27వ తేదీన జరగనున్న రథయాత్ర సందర్భంగా గుండిచా మందిరాన్ని ప్రత్యేకంగా అలంకరించనున్నట్లు తెలిపారు.

162 చోట్ల యోగా శిబిరాలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రకుమారి

పాతపట్నం: ఈ నెల 21వ తేదీన మండలంలోని 18 గ్రామ సచివాలయ పరిధిలో 162 చోట్ల 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.చంద్ర కుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో యోగా దినోత్సవంపై కార్యదర్శులు, రెవెన్యూ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల ఆవరణల్లో యోగా శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. 18 గ్రామ సచివాలయ పరిధిలో 18 మంది నోడల్ అధికారులను, ఇన్‌చార్జ్‌లను నియమించామన్నారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్ చేయాలని, మొక్కలను నాటాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ బి.వెంకటరమణ, సూపరింటెండెంట్ తిరుపతి పట్నాయక్ పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో మేలు



అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సారవకోట: మండలంలోని తొగిరి గ్రామంలో వరి విత్తన శుద్ధిపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గురువారం అవగాహన కల్పించారు. 30 కేజీల వరి విత్తనాలను సుడో మోనస్‌తో ఏ విధంగా విత్తన శుద్ధి చేసుకోవాలో వివరించారు. విత్తన శుద్ధి చేయడం వలన పంట దిగుబడి, తెగుళ్లను ఏ విధంగా అరికడుతుందో తెలియజేశారు.

సన్మానం..



యోగేశ్వరరావును సన్మానిస్తున్న ఉద్యోగులు

సారవకోట: ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగేశ్వరరావును గిరిజన సంక్షేమ శాఖ 4వ తరగతి ఉద్యోగులు మండల కేంద్రంలో గురువారం సన్మానించారు. గిరిజన సంక్షేమ శాఖలో విధులు నిర్వహిస్తున్న 4వ తరగతి ఉద్యోగులైన కుక్, కమాటీ, వాచ్‌మన్ తదితర ఉద్యోగుల సమస్యలను జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. దశాబ్దాల నుంచి ఎదురుచూస్తున్న వారి సమస్యలను పరిష్కరించినందుకు మెళియాపుట్టి, మందస క్లస్టర్‌ల పరిధిలో ఉన్న 4వ తరగతి ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



జూనియర్ కళాశాలలో పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్

హిరమండలం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలను ప్రిన్సిపాల్ పి.అప్పలరాము ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. మండలంలోని భగీరథిపురం ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కానుకలను సర్పంచ్ వంజరాపు చిరంజీవి విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం టి.ధనలక్ష్మి, స్కూల్ కాంప్లెక్స్ చైర్‌పర్సన్ లక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు కె.నాగరాజు, ఎస్‌ఎంసీ చైర్మన్ వై.మనోజ్, సీఆర్పీ గోవిందరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



పంటలను పరిశీలిస్తున్న అడిషనల్ డీపీఎం ధనుంజయరావు

ఎల్.ఎన్.పేట: తక్కువ పెట్టుబడితో పంటలు పండించే ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతుల్లో అవగాహన పెంచాలని ప్రకృతి వ్యవసాయం అడిషనల్ డీపీఎం ఎన్.ధనుంజయరావు అన్నారు. మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పంటలను గురువారం పరిశీలించారు. రసాయన ఎరువులు, పురుగు మందులు లేకుండా సాగు చేయటం వలన రైతులకు పెట్టుబడి భారం తగ్గుతుందన్నారు. భూసారం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. పెరటి పంటగా కూరగాయలు, ఆకు కూరలు, పందిరి కూరగాయల పంటలను పండించేందుకు రైతులు ముందుకు వస్తే ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వారికి తగిన సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. ఎస్‌పీఎంయూ రామకృష్ణ, ఎంటీ సూర్యనారాయణ, రమణ, ఎల్.ఎన్.పేట మండల యూనిట్ ఇన్‌చార్జి బి.లలిత, ఐసీఆర్పీలు సంతోషి, పూజ, జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

ముక్కు మూయాల్సిందే..!

- పెంటకుప్పలను తలపిస్తున్న ఏబీ రోడ్డు
- రోడ్డుపక్కనే చేపలు, చికెన్ వ్యర్థాలు
- కంపు కొడుతున్నా పట్టించుకోని అధికారులు



ఎల్.ఎన్.పేట మండల కేంద్రం నుంచి లక్ష్మీనర్సుపేట గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన వేస్తున్న చెత్త



ఏబీ ప్రధాన రోడ్డు పక్కనే పడేసిన చికెన్, చేపల వ్యర్థాలు

ఎల్.ఎన్.పేట: మండల కేంద్రంతోపాటు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే అలికాం–బత్తిలి రోడ్డులో ఇరువైపులా అర కిలో మీటరు వరకు వ్యర్థాలు వేయటంతో పెంటకుప్పలను తలపిస్తోంది. దుర్గంధం వెదజల్లడంతో ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ముక్కు మూసుకొని ప్రయాణిస్తున్నారు. మండల కేంద్రంలో ఉన్న కూరగాయల వ్యాపారులు, చేపలు, చికెన్‌షాపు యజమానులు రోడ్డు పక్కనే వ్యర్థాలను పడేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కుళ్లిపోయి భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. రోడ్డు పక్కనున్న పంట పొలాల్లో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, రైతు కూలీలు కూడా దుర్వాసనను భరించలేక పోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయలు, చేపలు, చికెన్ వ్యర్థాలను గ్రామాలకు దూరంగా తరలించాల్సి ఉన్నప్పటికీ.. ఆటోల్లో తీసుకుని వచ్చి ఏబీ రోడ్డు పక్కనే పడేస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఈ విధంగానే జరుగుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు, మండల పరిషత్, పంచాయతీ, గ్రామ సచివాలయ సిబ్బంది పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దుర్వాసనతో ఇబ్బంది



మండల కేంద్రానికి ఏబీ ప్రధాన రోడ్డుతోపాటు లక్ష్మీనర్సుపేట గ్రామం వైపు నుంచి ద్విచక్ర వాహనంపైన వెళ్తుంటే భరించలేని కంపు వేస్తోంది. రోడ్డు పక్కన చేపలు, చికన్ వ్యర్థాలతో పాటు కుళ్లిన కూరగాయలను పడేస్తున్నారు.

– పల్లి అప్పలనాయుడు, దబ్బపాడు, ఎల్.ఎన్.పేట

చెత్తను తొలగిస్తాం



మండల కేంద్రంతోపాటు రోడ్డుకు రెండు వైపులా ఉన్న చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. ఈ విషయమై సంబంధిత పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి చెత్త వేస్తున్న వారిని గుర్తించి వారికి నోటీసులు ఇస్తాం. రోడ్డు పక్కన చెత్త, ఇతర వ్యర్థాలు వేయకుండా ఉండేలా అవగాహన కల్పిస్తాం.

– ఎస్ శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ, ఎల్.ఎన్.పేట

కోనేరు మెట్లు శిథిలం



నరసన్నపేట మండలం కరగాంలోని నర్సింగపల్లికి వెళ్లే మార్గంలో ఉన్న కోనేరు మెట్లు పూర్తిగా పాడయ్యాయి. వర్షాకాలం ప్రారంభం అవడంతో కోనేరులో నీరు చేరుతుంది. ఈలోగానే కోనేరు మెట్లును బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. – నరసన్నపేట

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం

- వైఎస్సార్‌సీపీ మేధావుల విభాగం జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావు



మాట్లాడుతున్న ఈశ్వరరావు, నాయకులు

ఆమదాలవలస: రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని వైఎస్సార్ సీపీ మేధావుల విభాగం జిల్లా అధ్యక్షుడు కొప్పల ఈశ్వరరావు అన్నారు. ఆమదాలవలస పట్టణంలో పార్టీ కార్యాలయంలో గురువారం రాత్రి విలేకరులతో మాట్లాడారు. పార్టీ సీనియర్ నాయకుడు, పార్టీ అనుబంధ విభాగాల సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిపై ఎలాంటి విచారణ లేకుండా, నిరాధార ఆరోపణలతో అక్రమంగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామ్యమన్నారు. ఇలాంటి అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భాస్కర్ రెడ్డి దగ్గర గతంలో విధులు నిర్వర్తించే పోలీసులను మానసికంగా, శారీరకంగా హింసించి, వారి ద్వారా తప్పుడు రిపోర్టులు తయారు చేశారన్నారు. వాటి ఆధారంగా రాజకీయ కక్షకు దిగి అరెస్ట్ చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వ్యవస్థల్ని ఎంతగా దిగజారుస్తుందో ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ సెల్ విభాగాల అధ్యక్షుడు దానేటి రామ్మోహన్ మాట్లాడుతూ.. ఈ అరెస్టు వెనుక ఉన్న రాజకీయ ఉద్దేశాలను ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఇటువంటి చర్యలపై ప్రజాస్వామ్యవాదులు, సామాన్య పౌరులు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. సంయుక్త కార్యదర్శి అన్నెపు కృష్ణ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవించేలా ప్రభుత్వ వ్యవహార శైలి ఉండాలన్నారు. ఇలాంటి విషయాల్లో మేధావులు, ఉన్నత విద్యావంతులు, పౌర సంఘాలు ప్రతినిధులు మౌనంగా ఉంటే.. ఏదో ఒకరోజు ప్రజాస్వామ్యంలో భారత రాజ్యాంగానికి బదులు, రెడ్ బుక్ లాంటి రాజ్యాంగాలు రాజ్యమేలుతాయన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చింతాడ రాఘవేంద్రరావు అన్నారు.

సీడ్ డ్రిల్‌తో అధిక ప్రయోజనాలు



సీడ్ డ్రిల్ యంత్రం పనితీరు పరిశీలిస్తున్న ఏడీ రాజగోపాలరావు

సరుబుజ్జిలి: పెట్టీకమ్ సీడ్ డ్రిల్ విధానంలో విత్తనాలు వేయడం వలన అధిక ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయశాఖ ఏడీ బొడ్డేపల్లి రాజగోపాలరావు అన్నారు. మండలంలోని చిగురువలస పంచాయతీ పరిధిలోని వెన్నెలవలస గ్రామంలో రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పెట్టీకమ్ సీడ్ డ్రిల్ విధానంపై క్షేత్ర స్థాయిలో రైతులకు కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాలను గురువారం పరిశీలించారు. రైతులకు అవసరమైన పరికరాలను ఉచితంగా అందిస్తున్న రెడ్డీస్ ఫౌండేష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ మండల సమన్వయకర్త అత్తులూరి లావణ్య, పాతిన శ్రీనివాసరావు, శివ్వాల కుమారి, సవర శివ కుమార్, నేతింటి బాల, పలువురు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మాస్టారు సెలవు పెడితే..

ఆ రోజు పాఠశాల మూతే..!



చందనగిరి ప్రాథమిక పాఠశాల



సీఆర్పీ రాకపోవడంతో ఆరుబయట ఉన్న విద్యార్థులు

మెళియాపుట్టి: మండలంలో ఎత్తైన గిరిశిఖర గ్రామం చందనగిరిలోని ప్రాథమిక పాఠశాలలో ఏడుగురు విద్యార్థులకు సీఆర్పీ ఉన్నారు. గురువారం ఉదయం 10.30 నిమిషాలకే విద్యార్థులు ఆరుబయట ఆడుకుంటున్నారు. విద్యార్థులతో మాట్లాడగా ఈ రోజు మాస్టారు రాలేదని అందుకే ఆడుకుంటున్నామని తెలిపారు.

పాఠశాలను పరిశీలిస్తే..

తరగతి గదిని పరిశీలిస్తే గచ్చుకూడా లేదు. అక్కడే గ్రామానికి సంబంధించిన వంటపాత్రలు, ఇతర వస్తువులు కనిపించాయి. మరుగుదొడ్ల నిర్మాణం పూర్తికాలేదు.

చర్యలు తీసుకుంటాం..

చందనగిరి గ్రామంలో పని చేస్తున్న సీఆర్పీ గురువారం సెలవు పెట్టినట్లు మా దృష్టికి రాలేదు. ఆయన పనితీరు సరిగా లేకపోవడంతో షోకాజ్ నోటీసు సైతం ఇటీవల జారీ చేశాం. చందనగిరి గ్రామం కొండపై ఉండటంతో ఎప్పటికప్పుడు పరిశీలన చేయలేక పోతున్నాం. ఆ గ్రామాన్ని సందర్శించి చర్యలు తీసుకుంటాం.

– ఎంఈఓ–2, పద్మనాభరావు, మెళియాపుట్టి



అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లు



పాఠశాలలో ఉన్న వంట పాత్రలు, ఇతర సామగ్రి

పరామర్శ..



తిరుమలరావును పరామర్శిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య

నరసన్నపేట: మండలంలోని తోటాడ, నరసన్నపేట, యారబాడు, పారశిల్లి, మాకివలసలోని పలు కుటుంబాలను పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య గురువారం పరామర్శించారు. తోటాడకు చెందిన గొర్లె పాపమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని, మాకివలసకు చెందిన బుద్దల దాలి నాయుడు మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న తాడేల కృష్ణారావు, కోరుకొండ తులసమ్మ, సురవరపు భాస్కరరావు, పారిశిల్లి గ్రామంలో తిరుమలరావును పరామర్శించి వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ ఆరంగి మురళి, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రామారావు, లుకలాపు రవి, బార్ల వేణుగోపాలరావు, సురంగి నర్సింగరావు, కింతల చలపతి, కనపల శేఖరరావు, మొయ్యి లక్ష్మునాయుడు, అంపోలు సుధ, పాగోటి గోవిందరావు, వేలాల రమేష్, తదితరులు ఉన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలో శుక్రవారం తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఓ పి.రామచంద్రరావు గురువారం తెలిపారు. పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న పంప్ హౌస్ నుంచి ప్రధాన వాల్ మరమ్మతులు గుర్తైందన్నారు. ఉదయం వాల్ మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు.